




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

సోమవారం, ఆగష్టు 31, 2026 fallow on తెలంగాణ పేజీలు : 4



# విఫల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

సెప్టెంబర్ 1 నుంచి బీఆర్ఎస్ బిగ్ ఫైట్

**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 10 రోజుల పాటు భారీ నిరసనలు..**

**పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు..**

**ఖమ్మం, ఆగస్టు 30, జనం ముచ్చట :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మరోసారి పోరుబాట పట్టనుంది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో, పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమాలను కొనసాగిస్తుందని పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు.....

**10 రోజుల పాటు నిరసనల హోరు....**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణను చేపడుతోందని పువ్వాడ తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని

2 లో..



2 లో..

## ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ...

# నీట్--పీజీ 2026 పరీక్ష

**668 మంది అభ్యర్థులకు కేటాయింపు.. 642 మంది హాజరు.. 26 మంది గైర్హాజరు...**

**పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి...**

**ఖమ్మం, ఆగస్టు 30, జనం ముచ్చట:** ఖమ్మం జిల్లాలో ప్రతిష్టాత్మకమైన నీట్--పీజీ (చీజుజు-ా+) 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా, సజావుగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షను పూర్తి పారదర్శకతతో నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.నీట్--పీజీ పరీక్ష నిర్వహణలో భాగంగా జిల్లాలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు



2 లో..

## ఖమ్మం కార్పొరేషన్ 17,53వ డివిజన్‌లలో

# బోనాల పండుగ

**ఖమ్మం సిటీ, జనం ముచ్చట:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ మరియు 53వ డివిజన్‌లలో బోనాల పండుగ జాతరలను భక్తిశ్రద్ధలతో, పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొని భక్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి పగడాల నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీక బోనాల పండుగ అని అన్నారు.

# ఖమ్మం కార్పొరేషన్ 17,53వ డివిజన్‌లలో బోనాల పండుగ...



**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆడబిడ్డలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు..ప్రతి ఇంటిపై అమ్మవారి ఆశీస్సులు ఉండి, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. బోనాల పండుగను పురస్కరించుకుని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పాలడుగు పాపారావు, పగడాల శ్రీవిద్య, నాయకులు ఖయూమ్,వడేఢల్లి వెంకటనారాయణ ,చెవుల శ్రీనివాస్ యాదవ్ ,బొమ్మ శ్రీను ,బొమ్మ వెంకన్న ,బొమ్మ మల్లయ్య ,శ్రీశేలం, ఆలకుంట రవి, ఎల్లయ్య, శ్రీను, వెంకన్న, రామకృష్ణ, యేసు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 44వ డివిజన్‌లో ఘనంగా

# గంగపుత్రుల బోనాల పండుగ



**ఖమ్మం సిటీ: జనం ముచ్చట**

నగరంలోని 44వ డివిజన్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన

ఈ వేడుకల్లో గంగపుత్ర సంఘం సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల పండుగ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పండుగ సందర్భంగా డప్పులు, నృత్యాలు, సంప్రదాయ కార్యక్రమాలతో డివిజన్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బోనాల పండుగను సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గంగపుత్రుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సోమయ్య, గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, కోశాధికారి సుధాకర్, డోలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.....

## చేతివృత్తిదారులకు అండగా ప్రధాని విశ్వకర్మ యోజన : నున్నా రవికుమార్

**నేలకొండపల్లి, జనం ముచ్చట**

అంతరించిపోతున్న చేతివృత్తులను ప్రోత్సహించి, ఆయా వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిదారులకు చేయూత అందిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నున్నా రవికుమార్ తెలిపారు.

ఆదివారం పాలేరు అసెంబ్లీ పరిధిలోని నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు వివిధ రకాల పనిముట్లను నున్నా రవి కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాషింగ్ మెషీన్లు, కుమ్మరి వృత్తిదారులకు మట్టి కలిపే యంత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.



ఈ సందర్భంగా నున్నా రవికుమార్ మాట్లాడుతూ.. దేశంలో తరతరాలుగా చేతివృత్తులను నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థికంగా, సాంకేతికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తెలిపారు. అంతరించిపోతున్న సంప్రదాయ చేతివృత్తులను కాపాడటంతో పాటు, వృత్తిదారుల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసి వారి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు.పాలేరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు సుమారు 2 వేల మంది లబ్ధిదారులకు వివిధ రకాల యంత్రాలు, పనిముట్లు అందించినట్లు నున్నా రవికుమార్ తెలిపారు. దీనితో పాటు లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం కూడా అందుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ వృత్తులను మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు.

అనాసాగరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గూనగుంట్ల అనిల్, చల్లగుండ్ల రామా రావు, రేగళ్ల రామకృష్ణ, గుణగుంట్ల రామకృష్ణ తదితరులకు పనిముట్లను అందజేశారు. ముఖ్యంగా కుమ్మరి వృత్తి దారులకు మట్టి కలిపే యంత్రాలు అందుబాటులోకి రావడంతో వృత్తిలో శ్రమ తగ్గి, ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు కోటి హనుమంతరావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మీకడ గోపితో పాటు గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా సంప్రదాయ వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు, శిక్షణ,

ఆర్థిక సహకారం అందించడం వల్ల వారి వృత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తు ందని కార్యక్రమంలో ాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.



# విఫల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం..

(మొదటి పేజీ తరువాయి)

అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.....

**పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలి...**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు....

# ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ... నీట్--పీజీ 2026 పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 668 మంది విద్యార్థులను కేటాయించారు. వీరిలో 642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 26 మంది గైర్హాజరయ్యారు...

పరీక్షా నిర్వహణ తీరును పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ఆదివారం జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, అభ్యర్థుల హాజరు, పరీక్షా నిర్వహణ ప్రక్రియ తదితర అంశాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నీట్--పీజీ 2026 పరీక్షను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షా ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరిగేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.....

అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పరీక్ష సజావుగా పూర్తయిందని అదనపు కలెక్టర్ వెల్లడించారు.జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాలకు కేటాయించిన 668 మంది అభ్యర్థుల్లో 642 మంది పరీక్షకు హాజరు కావడంతో హాజరు శాతం సుమారు 96.1 శాతంగా నమోదైంది. మిగిలిన 26 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు.ఈ కార్యక్రమంలో

అదనపు కలెక్టర్ తో పాటు ఇంటర్మీడియట్ అధికారి రవి బాబుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్ష ప్రశాంతంగా ముగిసేలా అధికారులు చర్యలు చేపట్టారు....

# రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

**విద్యా, వైద్యం, రహదారి, నీటిపారుదల రంగాల అభివృద్ధికి భారీగా నిధులు...**

**2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి....**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన భట్టి**



ఖమ్మం, ఆగష్టు 30 (జనం ముచ్చట)

దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు మండలంలో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

మండలంలోని కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, రూ.1.75 కోట్లతో లచ్చగూడెం --నేరడ పీఆర్ రహదారి వరకు చింతకాని-- వందనం ఆర్అండ్‌బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.7 కోట్లతో లచ్చగూడెం-- అనంతారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు చింతకాని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ.5.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నేటి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కోసం అనేకకార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం క్రింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు.

ఇండ్లు లేని నిరుపేదలకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇప్పటి వరకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు నిరుద్యోగ యువత కోసం తొలి ఏడాదిలో 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా క్రింద రికార్డు సమయంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని కేవలం 9 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని అన్నారు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం పెట్టిన వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది పేద విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు.

**విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు:**

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ 100 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మంజూరు చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని రూ.200 కోట్ల నిధులతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నా మని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒకే కుటుంబంలా కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను నిర్మిస్తున్నామని, తద్వారా సామాజిక మార్పుకు నాంది పలుకుతున్నా మని తెలిపారు. తెలంగాణలో మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను మంజూరు చేశామని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు.

**రోడ్లు, నీటిపారుదల, వైద్య రంగాలకు భారీగా నిధులు:**

రాష్ట్రంలోని రహదారి నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు రూ.90 వేల కోట్లతో పలు ప్రణాళికలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులకు మరో రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణను పూర్తిచేయడానికి భారీ ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, అదనంగా 14 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

**మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ భీమా:**

మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను వడ్డీ లేకుండా అందిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. వడ్డీ లేని రుణాల పరిమితి ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం క్రింద రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పా ట్లు చేస్తోందని అన్నారు దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలకు వ్యతిరేకంగా కొంతమంది రాజకీయ వ్యక్తులు కృషి చేస్తున్నారని, వారి వలలో ప్రజలు పడవద్దని డిప్యూటీ సీఎం సూచించారు 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని, అభి వృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు బాటలు వేస్తున్నా మని అన్నారు ప్రపంచంలో అభివృద్ధి చెందిన జపాన్, కొరియా వంటి దేశాల తో తెలంగాణ పోటీ పడే విధంగా రాష్ట్రాన్ని నిలిపేందుకు ముఖ్యమంత్రి నాయ కత్వంలో క్యాబినెట్, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు.

# తలసేమియా వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

**-- తలసేమియా చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక**

**-- సంకల్ప వార్షికోత్సవంలో సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ.విజయ్‌బాబు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్ కుమార్**

ఖమ్మం, ఆగష్టు 30 (జనం ముచ్చట)

తలసేమియా వ్యాధి నిర్మూలనకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా పనిచేయాలని, బాధిత చిన్నారులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక అని సీటీసీ అడిషనల్ డీసీపీ విజయ్ బాబు పేర్కొన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఈ.విజయ్‌బాబు మాట్లాడుతూ.. కేవలం వార్షికోత్సవాలు జరుపుకోవడమే కాకుండా, తలసేమియా బాధితుల సంఖ్యను తగ్గించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంకల్ప సంస్థ గత 16 ఏళ్లుగా అందిస్తున్న సేవలు మార్గదర్శనీయం అని కొనియాడారు. రక్తం కొరతతో ఏ ఒక్క తలసేమియా చిన్నారి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చనే అవగాహనను ప్రతి ఒక్కరిలోనూ పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులకు మెరుగైన జీవనాన్ని, భరోసాని అందించడమే మనందరి ప్రధాన లక్ష్యం కావాలని ఆకాంక్షించారు.

**పిల్లల ఆరోగ్యంతో పాటు ఉన్నత భవిష్యత్తు ముఖ్యం :**

సమాజంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ పిల్లలు ఉన్నతమైన భవిష్యత్తును సాధించాలని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సొంత కుటుంబ సభ్యుల సమస్యలనే పట్టించుకోలేని వర్తమాన సమాజంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రవి, అనిత బాధ్యతాయుతంగా పిల్లల సంక్షేమం కోసం సేవలు అందించడం విశేషమన్నారు. పిల్లలను సమాజంలో ఇతరులతో సమానంగా చూడాలని, వారి ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల సమాజం సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు.

**పిల్లలతో ముఖాముఖి..**

కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కిరణ్ కుమార్ తలసేమియా చిన్నారులతో నేరుగా ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తమ లక్ష్యాలను సాధించాలని, పూర్తి ధైర్యవంతులుగా ఎదగాలని సూచించారు. ఏఆర్ ఆర్ఐ కామరాజు మాట్లాడుతూ... తలసేమియా చిన్నారులకు ఎప్పుడు రక్తం అవసరమైనా రక్తదానం చేసేందుకు తాము సిద్ధంగా ఉంటామని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించే సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు సహకారం అందిండం ద్వారా తాము సేవలో భాగం అవుతున్నామని, ఇది మానసిక సంతృప్తినిస్తుందని అన్నారు. అనంతరం రక్తదాతలను, చిన్నారుల కోసం సంస్థకు సహకారం అందిస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, ప్రముఖ విద్యావేత్తలు భాగ్య, మమత, సామాజికవేత్త అనురాధ, సంస్థ బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, ఆర్.కస్తూరి, పి.వంశీకిరీటి, సువర్ణకుమారి, ఏఆర్ కానిస్టేబుల్ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.